క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సోమవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశంలో 18 అంశాలతో కూడిన అజెండాపై చర్చిస్తామన్నారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కె.గంగవరం: మసకపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 9 గంటలకు ఉచితక కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నేతృత్వంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరాన్ని మసకపల్లి పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



ఎంపీపీలు, సర్పంచులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్

రామచంద్రపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో డివిజనల్ స్థాయి లోకలైజేషన్ ఆఫ్ స్టయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌పై రెండు రోజుల శిక్షణా తరగతులను సోమవారం ప్రారంభించారు. రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీలు, రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం మండలాల సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. మొదటి రోజు శిక్షణలో భాగంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, పేదరికం లేని మెరుగైన జీవనోపాధుల కలిగిన గ్రామం, సామాజిక భద్రత, సామాజిక న్యాయం, పిల్లల స్నేహ పూర్వక గ్రామం, పరిశుభ్రత, పచ్చదనం కలిగిన గ్రామం తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లు పెట్టా సత్యనారాయణ, కేవీవీ సత్యనారాయణ, చిల్లే వెంకటేష్, పీవీవీఎస్ సాయి మనిహోత్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీడీఓ ఎస్.సెలట్ రాజు, ఏఓ చాగంటి వెంకట అచ్యుత రామ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పి.అరుణ్‌సాయి, టి.దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వాహన లైసెన్స్‌లు ఆధునీకరించుకోవాలి

కపిలేశ్వరపురం (మండపేట): రవాణా శాఖలో వివిధ విభాగాలకు చెందిన వాహనాల లైసెన్సులకు షెడ్యూల్ సమీపించిన యాజమానులు తమ లైసెన్స్‌లను ఆధునీకరించుకోవాలని మండపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశిన శివనాగ మల్లేశ్వరరావు సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వాహనాల వివరాలను రిజిస్ట్రేషన్ చేయించి, వెల్ఫేర్ ఫండ్ కట్టాలన్నారు. వాహన యజమానులు తమ పరిధిలో కార్మికులకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. వాహన బ్రేక్‌లను క్రమం తప్పకుండా చేయించాలన్నారు. డ్రైవర్లకు యూనిఫాం, రెయిన్ కోట్, వాహనంలో ప్రథమ చికిత్స బాక్స్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. దూర ప్రయాణాల సమయంలో తగిన విశ్రాంతి ఇచ్చేలా చూడాలని, అవసరమైనమేర వైద్య సదుపాయం కల్పించాలని, ఒక్కో కార్మికుడికి రూ.100 చొప్పున వెల్ఫేర్ ఫండ్ చెల్లించాలని యాజమానులకు ఆదేశాలు ఇచ్చినట్టు మల్లేశ్వరరావు తెలిపారు.

విద్యార్థులకు ఫైలేరియా పరీక్షలు

మామిడికుదురు: ట్రాన్స్‌మిషన్ అసెస్మెంట్ సర్వేలో భాగంగా అప్పనపల్లి ప్రధాన మోడల్ స్కూల్ 1, 2 తరగతులకు చెందిన విద్యార్థులకు సోమవారం ఫైలేరియా సంబంధిత పరీక్షలు చేశారు. మొత్తం 19 మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా నెగిటివ్ వచ్చిందని డాక్టర్ శామ్యూల్ ప్రణయ్ తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం నయనాల రఘు రామయ్య, ఎంపీహెచ్ మేల్ నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ బళ్ల నరసింహారావు, ఎంపీహెచ్ఈఓ హరి ప్రసాద్, వైద్య సిబ్బంది, టీచర్స్ పాల్గొన్నారు.

అలమూరు: నేటి సమాజానికి ప్రమాదకరమైన ఫైలేరియాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఓ) ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. ఫైలేరియాసిస్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం వ్యాధి వ్యాప్తక అంచనా సర్వే జరిగింది. అందులో భాగంగా మూలస్థాన అగ్రహారం ఎంపీపీ పాఠశాల, మడికి రవీంద్ర ప్రైవేట్ పాఠశాలలో చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్.లక్ష్మీ స్నేహలత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావు పాల్గొని ఫైలేరియా పరీక్షలను పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా దశల వారీగా విద్యార్థులందరికి ఫైలేరియా పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈఓ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆయుధం

- వానాకాలంలో పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
- సరఫరాకూ అంతరాయం
- దేశంలో రోడ్డు ప్రమాదాల తరువాత విద్యుత్ ప్రమాదాలే అధికం



పడమర ఖండ్రికలో ఇటీవల విద్యుదాఘాతానికి మృతి చెందిన సెంట్రింగ్ కూలీ

కపిలేశ్వరపురం: ఆధునిక కాలంలో విద్యుత్ సదుపాయం లేకుండా జీవించడం అసాధ్యం. విద్యుత్ ఎంత సదుపాయమో అంత ప్రమాదకరం. నిర్లక్ష్యం వహిస్తే నిండు ప్రాణాలను హరిస్తుంది. అప్రమత్తంగా లేకుంటే ఇంటిలోనూ, పని ప్రదేశాల్లోనూ, ఆరుబయట, బహిరంగ ప్రదేశాల్లో ఇలా ఎక్కడైనా విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది.

2022లో 12,200 మంది

ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకుంటే కుటుంబం వీధిన పడుతుంది. దేశంలో రోడ్డు ప్రమాదాలు మొదటి స్థానంలో ఉండగా ఆ తర్వాత విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఈ విషయాన్ని జాతీయ నేర గణాంక సంస్థ నిర్ధారించింది. 2022లో దేశంలో 12,200 మంది విద్యుత్ ప్రమాదాలకు గురయ్యారు. 2011 -2021 మధ్య సుమారు లక్ష మంది విద్యుత్ ప్రమాదాలకు గురయ్యారు. ఆ తర్వాత సైతం తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ఉసురు తీసిన విద్యుత్ ప్రమాదాలు ఇలా..

ఈ నెల 9న పడమర ఖండ్రికలో ఇంటి సెంట్రింగ్ నిర్మాణం కోసం ఊస పైకి లాగుతుండగా 11కేవీ వైర్లకు తగిలి టేకి గ్రామానికి చెందిన సెంట్రింగ్ కూలీ వాసంశెట్టి శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆగస్టు 13న మండపేట మండలం జెడ్. మేడపాడులో లాకుల వద్ద విద్యుత్ స్తంభం నుంచి కరెంట్ ప్రసరించడంతో లష్కర్‌గా పని చేస్తున్న ఇప్పనపాడు గ్రామానికి చెందిన పసుపులేటి ప్రశాంత్ మృతి చెందాడు. ఆగస్టు 28న కాట్రేనికోన మండలం కొప్పిగుంటకు చెందిన కె.శ్రీనివాసరావు కరెంట్ ఇస్త్రీ పెట్టితో దుస్తులు ఐరెన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి బలయ్యాడు. 2023లో కాజులూరు మండలం బంధనపూడి శివారు మొగలలిపాలెంలో కె.సుబ్బారావు (88) ఈదురు గాలులకు నేలరాలిన కొబ్బరి కాయలు, ఆకులను సేకరిస్తుండగా తెగిపడిన విద్యుత్ వైరు తగిలి చనిపోయాడు. కపిలేశ్వరపురం మండలం తాతపూడిలో కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు జరుగుతుండగా విద్యుత్ వైరు తగిలి మేస్త్రి మృతి చెందాడు. 2021 డిసెంబర్ 13న కపిలేశ్వరపురం మండలం అచ్యుతాపురానికి చెందిన వ్యవసాయ కూలి కొమ్మరి సత్యనారాయణ (53) చేతిపంపునకు విద్యుత్ ప్రవహించడంతో మృతి చెందాడు. ఇంకొన్ని ప్రమాదాల్లో పలువురు గాయాలపాలయ్యారు.

వ్యవసాయ క్షేత్రాల్లో ఏమరుపాటు తగదు

విశాల వ్యవసాయ క్షేత్రంలో వర్షాకాలంలో రక్షణ తక్కువ. వర్షం వస్తే చెట్టు నీడనో, పశువుల పాకలోనే చేరతారు. ఆ ప్రదేశాల్లో విద్యుత్ వైర్లు ఉంటే ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయి. పిడుగు పాటుకు వ్యవసాయ రైతులు, కూలీలు, పాడి గేదెలు మృతి చెందిన ఘటనలూ అనేకం ఉన్నాయి. విద్యుత్ మోటారు ఆన్, ఆఫ్ చేసేటప్పుడు ప్రమాదాలు జరిగిన సందర్భాలూ ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారులు సూచించిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు. వర్షాలు పడుతున్నప్పుడు గోడలు, నేల విద్యుత్ స్తంభాలు తేమతో నిండి ఉంటాయి. విద్యుత్ లైన్‌కు ఆనుకుని ఉన్న స్తంభాల నుంచి నేలకు, గోడలకు ఇతర వస్తువులకు విద్యుత్ ప్రవహించి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి.

సమన్వయ లోపంలో..

విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణలో క్రింది స్థాయి ఉద్యోగులు, సిబ్బంది విధులను నిర్వహిస్తుంటారు. వారి మధ్య సమన్వయం లోపించినప్పుడు క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రాణాలను కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. సాధారణంగా విద్యుత్ లైన్ల నిర్మాణ పనులు ప్రైవేటు వ్యక్తులు చేస్తుంటారు. స్తంభాల ఏర్పాటు, అమరిక పనుల్లో సైతం ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం ఉంటుంది. విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణ ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వహించడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఇక క్షేత్ర స్థాయిలో సబ్ స్టేషన్ల బ్రేకర్లు, ఏబీ స్విచ్‌లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు నిర్వహణ సక్రమంగా నిబంధనలు మేరకు, ఉద్యోగుల సమన్వయంతో చేపట్టాల్సి ఉంది. ఎర్తింగ్ సరిగ్గా లేకపోయినా ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విద్యుత్ వైర్లను ఆనుకుని ఎలాంటి వస్తువులను చేర్చవద్దు.
- విద్యుత్ వైర్లను ఇతర వైర్లతో కలపనీయరాదు. సపోర్ట్ వైర్లుగా ఇన్సులేటెడ్ వైర్లను ఉపయోగించాలి.
- ఓల్టేజీలో హెచ్చు తగ్గులు ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- చెట్ల కొమ్మలు వైర్లను, స్తంభాలను తాకుతుంటే ముందస్తుగా విద్యుత్ శాఖ అధికారులకు సమాచారాన్ని అందించాలి. తెగిపడిన వైర్లను తాకకుండా జాగ్రత్తపడాలి.
- ఎవరికైనా విద్యుత్ షాక్ తగిలితే రక్షించాలన్న ఆతృతతో తాకరాదు. ముందస్తుగా బాధితుడిని తాకిన వైరును తొలగించే చర్యలు చేపట్టాలి.
- వ్యవసాయ క్షేత్రాల్లో మోటార్‌ను ఆన్, ఆఫ్ చేసేటప్పుడు నేల చెమ్మగిల్లి లేకుండా చూసుకోవాలి.
- తడి చేతులు, తడి కాళ్లతో విద్యుత్ ఉపకరణాలను తాకరాదు.
- విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తితే అధికారులకు తెలిపి సమస్యను పరిష్కరించుకోవాలి. సొంత ప్రయోగాలు చేయడం ప్రమాదకరం.

ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన ఆలయ నూతన ధర్మకర్తల మండలి

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశర స్వామి, దక్షిణామూర్తి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం ద్రాక్షారామలో ఘనంగా జరిగింది. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా రాజా కాకర్లపూడి రాజగోపాల నర్సరాజు బహదూర్, ధర్మకర్తలుగా తీపర్తి బేబీ, ఉప్పరాపల్లి వీరనారాయణమ్మ, కుక్కల సత్యవేణి, మాకం పద్మావతి, నిట్టల సత్య జోగారావు, కొప్పిశెట్టి వీర వెంకట సత్యనారాయణ, బండి సత్య వీరభద్రరావు, పోతురాజు బాల, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా కొంతేటి బాల సుబ్రహ్మణ్యశర్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.బాలాజీ రాంప్రసాద్, ఈఓ యాళ్ల వీవీ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం తదితరులు నూతన ధర్మకర్తల మండలి సభ్యులను అభినందించారు.

ప్రజా సమస్యలపై గరంగరం



తాగునీటి ఇబ్బందులపై అధికారులను నిలదీస్తున్న సర్పంచులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంబాబు

- తాగునీటి ఇబ్బందులపై అధికారులను నిలదీసిన సభ్యులు
- వాడీవేడిగా మండల సమావేశం

కాజులూరు: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతిని సభ్యులకు వివరించారు. గ్రామాల్లో ప్రజా సమస్యలపై సభ్యులు గళమెత్తారు. ఒంటితాడి, శీల, మతుకుమిల్లి గ్రామాల సర్పంచులు నెల్లి బ్రహ్మజీ, కొమలి వెంకటరమణ, పెట్టా వీరనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. వారానికి ఒక్కసారి కూడా నీటి సరఫరా జరగటం లేదని ఒకవేళ వచ్చినా కుళాయికి బిందె నీరు కూడా రావటం లేదని మండిపడ్డారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూప మాట్లాడుతూ కుళాయి ట్యాంకుల్లో నాచు పెరిగిపోయి ఫిల్టర్ బెడ్ పని చేయడం లేదన్నారు. కాంట్రాక్టర్ అందుబాటులో లేకపోవడంతో నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయని, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. మంజేరు సర్పంచ్ గుంటూరి అప్పారావు ఎరువుల కొరతపై అధికారులను నిలదీశారు. సీపీసీఏస్‌లకు వచ్చిన ఎరువులను సిబ్బంది బ్లాక్ మార్కెట్లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సాగునీటి, గృహ నిర్మాణ బిల్లులు, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ లో వోల్టేజ్ సమస్యలను సభ్యులు ఏకరువు పెట్టారు. ఎంపీడీఓ జె.రాంబాబు, తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ సభ్యుల పశ్నలకు సమాధానాలు చెప్పారు. మండల వ్యవసాయాధికారి వి.అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎరువుల కొరత ఉన్నప్పటికీ కాజులూరు మండలంలో ముందస్తుగా ఖరీఫ్ సాగు చేపట్టడంతో కొరత ఏర్పడే సమయానికి ఎరువుల వినియోగ దశను దాటామన్నారు. మండలంలోని 26 గ్రామాలకు 26 డ్రోన్ స్ప్రేయర్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకూ రెండు మాత్రమే రైతులు తీసుకున్నారని తెలిపారు. వైస్ ఎంపీపీలు పెదిరెడ్డి వెంకటరమణ, రేఖాడి విజయ, బందనపూడి ఎంపీటీసీ సలాది లక్ష్మణరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

‘వంటా–వార్పు’ను విజయవంతం చేయాలి

కాజులూరు: మండలంలో కుయ్యేరు–గొల్లపాలెం రహదారి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఈ రోడ్డు విషయంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 17న నిర్వహించే వంటా, వార్పు కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని అఖిల పక్షం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వివిధ పార్టీల నాయకులు కమిటీలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటించారు. వంటా, వార్పు కార్యక్రమానికి స్థానికులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా సలాది నానాజీ, యాళ్ల సత్తిబాబు, శీల మాజీ ఎంపీటీసీ మాదవరపు నాజాజీ మాట్లాడుతూ గొల్లపాలెం, కుయ్యేరు మధ్య రూ.36 కోట్లతో 13 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయంలో పనులు ప్రారంభించారన్నారు. ఏళ్లు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఇటీవల వర్షాలకు రోడ్డుపై ఉన్న గోతుల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు దుస్థితిపై గత నెల 27న అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించగా మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందించి ఈ నెల 5వ తేదీ నాటికి పనులు పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అది కార్యరూపం దాల్చకపోవడంతో ఈ నెల 17 నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. తొలిరోజు కుయ్యేరు నుంచి కాజులూరు వరకూ బైక్ ర్యాలీ నిర్వహించి కాజులూరు కృష్ణుడి గుడి వద్ద రోడ్డుపై వంటా,వార్పు నిర్వహిస్తామని తెలిపారు.



వంటా-వార్పును విజయవంతం చేయాలని కరపత్రాలు పంచుతున్న కమిటీ సభ్యులు

వృత్తి పన్నుపై అవగాహన సదస్సు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి భవనంలో సోమవారం రామచంద్రపురం సర్కిల్ వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో వృత్తి పన్ను చెల్లింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సేల్స్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ పి.సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వృత్తి పన్ను చట్టం 1987 ప్రకారం ఏదైనా వృత్తి, వాణిజ్యం, వ్యాపారం ద్వారా ఉపాధి పొందుతున్న వారి వార్షిక వ్యాపారం రూ. 10 లక్షలకు పైబడినా, జీఎస్టీ నమోదిత వ్యాపారులు, నెలకు రూ.15 వేల కంటే ఎక్కువ వేతనం చెల్లించే యజమాని తన ఉద్యోగుల తరఫున వృత్తి పన్ను చెల్లించాలని వివరించారు. అర్హులైన వ్యక్తులు, సంస్థలు తమ వృత్తి, వ్యాపారం ప్రారంభించిన 30 రోజుల్లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. నిర్ణీత కాల వ్యవధిలో వృత్తి పన్ను నమోదు చేయించుకోకపోయినా, పన్ను చెల్లించకపోయినా జరిమానా విధిస్తారన్నారు.



ద్రాక్షారామలో వృత్తి పన్నుపై అవగాహన కల్పిస్తున్న సేల్స్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ

యజమానులు తమ ఉద్యోగుల వృత్తి పన్నును టీడీఎస్ మినహాయించుకుని సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.రత్నకుమారి, జీఎస్టీఓలు అనిత, సుబ్బలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు మణికంఠ రామచరణ్, నరేష్‌కుమార్, వ్యాపారస్తులు, ఉద్యోగులు, స్వయం ఉపాధిదారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో జిల్లాలోని వశిష్ట, వైనతేయ, గౌతమీ నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ ఏడాది తగ్గినట్టే తగ్గి నాలుగో సారి కూడా వరదలు రావడంతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెల వారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లాకు సరిహద్దులో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని పెదమల్లంక, అయోధ్యలంక, సిర్రావారిలంక, ఆనగర్లంక గ్రామాల ప్రజలకు కూడా పడవలపై ప్రయాణిస్తున్నారు.

ఉపాధి హామీ పథకం నిర్వీర్యం

వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు



కాజులూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు

కాజులూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దశల వారీగా నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు అన్నారు. ఉపాధి కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం కాజులూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ జె.రాంబాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో భాగంగా వేతనాలు కనీసం 15 రోజులకు ఒకసారి చెల్లించాలన్నారు. కాగా కూటమి ప్రభుత్వంలో ఈ నిబంధన అమలు కావడం లేదన్నారు. ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ వేతన బకాయిలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిలా సంఘం కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్, సంఘ నాయకులు చల్లారావు, కె.లక్ష్మణరావు, దంగేటి శ్రీను, సవిలి నాగేశ్వరరావు, చందాల శ్రీను, సత్యవతి, నాగమణి, సూర్యకుమారి పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ‘తూర్పు’లో విలీనం చేయాలని వినతి



అమలాపురం కలెక్టరేట్‌లో అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేయాలని విలీన పోరాట జేఏసీ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం జేఏసీ చైర్మన్ కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో సభ్యులు అమలాపురం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. తమ నియోజకవర్గ కేంద్రం మండపేటకు జిల్లా కేంద్రమైన అమలాపురం సుమారు 70 కిలోమీటర్లు దూరం ఉన్నందున ప్రజలు అవస్థలు పడుతున్నారని అధికారులకు వివరించారు. నియోజకవర్గంలోని 3 లక్షల మంది ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. గత ఎన్నికల్లో నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేస్తామంటూ కూటమి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కపిలేశ్వరపురం మండల పరిషత్ విప్ పలివెల మధు, బీజేపీ నాయకులు కోన సత్యనారాయణ, ప్రజా సంఘాల నాయకులు ధూళి జయరాజు, కాకర కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రాయవరంలో సామూహిక సీమంతాలు



రాయవరంలో సామూహిక సీమంతాలు చేస్తున్న అధికారులు, నాయకులు

రాయవరం: స్థానిక వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన చిన్నారులకు జన్మనివ్వడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు సౌజన్యంతో 80 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పూర్ణిమ, ఎంపీడీవో ఎస్.కీర్తిస్పందన, స్థానిక నేతలు కోట వెంకటరమణ, వల్లూరి శ్రీనివాస్, ఆంధ్ర దేవి, దేవిశెట్టి కరుణకుమార్, దేవిశెట్టి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



నేలటూరులో టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వీరన్న

కపిలేశ్వరపురం: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా అక్టోబర్ 15వ తేదీ వరకూ గ్రామాల్లో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేయనున్నట్టు పశు వైద్యులు డాక్టర్ రమణమూర్తి, డాక్టర్ లక్ష్మిమాధురి తెలిపారు. మండలంలోని నేలటూరులో 261 పశువులు, వాకతిప్పలో 200 పశువులకు సోమవారం ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా టీకాల కార్యక్రమం షెడ్యూల్‌ను వెల్లడించారు. మండలంలోని వల్లూరు, కోరుమిల్లి గ్రామాల్లో 16న, అచ్యుతాపురం, కాలేరులో 17న, వడ్లమూరు, నిడసనమెట్ట, మాచరలో 18న, నల్లూరులో 19న, టేకిలో 20న, వెదురుమూడిలో 22న, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురంలలో 23న, అంగర, కేదారిలంకలో 24న, అద్దంకివారిలంక గ్రామంలో 25న గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుక్కల వీరన్న, పశువైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని మాచవరం, నదురుబాద, వెదురుపాక, లొల్ల గ్రామాల్లో పశువులకు సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మాచవరం పశువైద్యాధికారి డాక్టర్ బిందు ఆధ్వర్యంలో పాడి పశువులకు వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బిందు పాడి రైతులకు గాలికుంటు వ్యాధి వలన కలిగే నష్టాలు, వ్యాధి లక్షణాలను వివరించారు. పాడి రైతులందరూ టీకా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలి రోజు 146 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.